# దైవంపట్ల ప్రేమ, దీనులపట్ల జాలి పెంచుకోండి!

(నవంబరు 12వతేదీన ఉదయం సాయికుల్వంత్ సభా మండపములో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో శ్రీవారు 78మంది వికలాంగులకు నూతన వస్త్రములతోపాటు ఎవరి అవసరానికి తగినట్లు వారికి వీల్ ఛైర్లు, కృత్రిమ అవయవములు, మూడు చక్రాల సైకిళ్ళు మరియు ఇతర పరికరములను అనుగ్రహించి అందరినీ ఆశీర్వదించారు. శ్రీవారి 78వ జన్మదినోత్సవమును పురస్కరించుకొని శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ, అనంతపురం క్యాంపస్ వారి ఆధ్వర్యంలో ఈ సేవాకార్యక్రమం నిర్వహింపబడింది. లబ్ధిదారులకు, భక్తులకు ఆరోజు అనుకోకుండా లభించిన అపూర్వమైన కానుక శ్రీవారి దివ్యోపన్యాసము. శ్రీవారు అప్పటికప్పుడు సంకల్పించుకొని ఇంగ్లీషులోనికి అనువాదం లేకుండా దాదాపు ఇరవై నిమిషాలసేపు ప్రసంగించారు. ఓదార్పు, సానుభూతి, జాలితో నిండిన వారి దివ్యమైన పలుకులు ఆ వ్యధిత హృదయాలను తాకి వారి కన్నులను కృతజ్ఞతాశ్రువులతో నింపినవి. లబ్ధిదారులందరినీ క్యాంటీన్‌లో ప్రసాదం తీసికొని వెళ్ళవలసిందిగా చెప్పి స్వామి అందరికీ ఆశీస్సులనందజేస్తూ తమ దివ్యోపన్యాసమును ముగించినారు. ఆనాటి శ్రీవారి దివ్యసందేశమును ఈ క్రింద ప్రచురిస్తున్నాము)

srisatyasaivachanamrutam

## తేదీ 12.11.2003, సాయికుల్వంత్ హాలు

**అన్నదానముకన్న అధిక దానంబేది?**
**తల్లిదండ్రులకన్న దైవమేది?**
**జపతపంబులకన్న సత్యశీలంబేది?**
**దయకంటె ఎక్కువ ధర్మమేది?**
**సుజన సంగతికన్న చూడ లాభంబేది?**
**క్రోధంబుకన్న శత్రుత్వమేది?**
**ఋణముకంటెను నరులకు రోగమేది?**
**ధరణి నపకీర్తికంటెను మరణమేది?**
**సర్వదా కీర్తికంటెను సంపదేది?**

**స్మరణకంటెను మించు ఆభరణమేది?**

**ప్రేమస్వరూపులారా!** దేహము అంగహీనము కావచ్చు. కాని, ఆత్మకు ఎట్టి అంగహీనతా లేదు. మీరు వికలాంగులైనంత మాత్రమున, "మాకు ఈవిధమైన దుస్థితి ఏర్పడిందే," అని వగచనక్కర్లేదు. మీకు అంగములు సరిగా లేకపోయి నప్పటికీ మీకు చేతనైన పనులు మీరు చేస్తూ, అంతో ఇంతో పరులకు ఉపయోగపడే పనులు చేస్తూ, భగవచ్చింతనలో కాలం గడుపుతూ, అన్ని అంగములూ సక్రమంగా ఉండి ఏ పనీ చేయని సోమరిపోతులకు తగినరీతిగా బుద్ధి చెప్పాలి. అన్ని అంగములూ సక్రమంగా ఉన్నవారు ఈనాడు ఏమి చేస్తున్నారు? అనేకమంది దుర్మార్గంలో ప్రవేశిస్తున్నారు, దుస్సంగంలో చేరుతున్నారు. అంగములన్నీ చక్కగా ఉండి, గొప్ప మేధాశక్తి ఉండి కూడను వాటిని దుర్వినియోగపరచుకునే దుర్మార్గులు ఎందరో ఉన్నారు. అంగములన్నీ సక్రమంగా ఉన్నవారే ఎక్కువ పాపాలు చేస్తున్నారు. అట్టి దుష్ప్రవర్తన, దురాలోచనలు మీకు రావడానికి అవకాశమే లేదు. కనుక, మీరెంతో అదృష్టవంతులనే చెప్పవచ్చు. మీకు ఇట్టి స్థితి కల్పించినందుకు దైవానికి మీరు కృతజ్ఞత చెప్పుకోవాలి. నిరంతరం దైవప్రార్థన చేస్తూ ఉండాలి.

అంగములందరికీ ఉంటున్నాయి. కాని, వాటితో చేయవలసిన మంచి కార్యములు

sri sathyasaivachanamrutam

ఎవరు చేస్తున్నారు? చేతులున్నాయి. చేతులతో మంచిపనులూ చేయవచ్చును, చెడ్డపనులూ చేయవచ్చును. కన్నులున్నాయి. వాటితో మంచినీ చూడవచ్చును, చెడునూ చూడవచ్చును. కనుక, అంగములన్నీ సక్రమంగా ఉన్నంత మాత్రమున సరిపోదు. వాటిని సద్వినియోగపరచుకున్నప్పుడే జీవితము సార్థకమౌతుంది. లేకపోతే అంగములున్నవారికి, అంగహీనులకు పెద్ద వ్యత్యాస మేమీ ఉండదు. అంగహీనులు పరులకు ఉపకారము చేయలేకపోవచ్చును. కాని, అంగములన్నీ సక్రమంగా కలిగినవారు మాత్రం ఏమి చేస్తున్నారు ఉపకారము? ఏమీ చేయడం లేదు.

తాత్కాలికంగా వచ్చే అంగవైకల్యములు కొన్ని, శాశ్వతంగా వచ్చేవి మరికొన్ని. కొన్ని అహంకారము చేతను, ఆడంబరాలకు పోవడంచేతను కూడా రావచ్చు. అయితే, మన సత్యసాయి కళాశాలలో చదివిన పిల్లలు, పనిచేసే టీచర్లు అంగహీనులను ఎంతో దయతో, ప్రేమతో చేరదీసి వారికి అంతో ఇంతో ఉపకారము చేస్తున్నారు. వారికి నిత్యకృత్యములు జరుపుకోవడానికి ఉపకరించే కొన్ని పరికరములు ఇస్తున్నారు. ఇందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఐతే, ఇటువంటి ఉపకారము కేవలం ఒక రోజో, రెండు రోజులో చేస్తే చాలదు. మనం ఇచ్చే పరికరములు ఎంతకాలము పనిచేయగలవు? వారి జీవితమంతా వాటిపైననే ఆధారపడి ఉంటుంది కదా! మనం ఇచ్చిన పరికరములు చెడిపోయిన ప్రతి పర్యాయమూ వారు వచ్చి మన సహాయం కోరడానికి వీలుకాదు. కనుక, మనమే వారివద్దకు వెళ్ళాలి. ఆ పరికరములు వారికి జీవితాంతమువరకు ఉపయోగపడేవిధంగా వాటిని అప్పుడప్పుడు సరిచేయించి ఇవ్వడానికి మన పిల్లలు సంసిద్ధులై ఉండాలి. ఈ ఉపకారము చేసేవారి పేరున ఒక పది లక్షల రూపాయల నిధిని ఏర్పాటు చేస్తాను. ఆ డబ్బును చెడిపోయిన పరికరములను సరిచేసి ఇవ్వడానికి వినియోగించవచ్చును. ఈవిధముగా, మనం వికలాంగులకు జీవితములో ఎట్టి కొరతా లేకుండా తగిన సహాయం చేసి ఆదర్శమునందించాలని నేను ఆశిస్తున్నాను.

**శాశ్వతంగా ఉపయోగపడే సేవలు చేపట్టాలి**

అంగహీనులైన పిల్లలను కన్న తల్లిదండ్రులు ఎంతగా దుఃఖిస్తుంటారో పాపం! “మా

sri sathyasai vachanamrutam

పిల్లలు పదిమందితో కలిసి జీవించలేకపోతున్నారే! వారికి పెళ్ళీ, పేరంటాలూ చేయలేకపోతున్నామే! వారి గతి ఏమిటి?" అని చాలా బాధ పడుతుంటారు. అటువంటి తల్లిదండ్రులకు మీరు తగినరీతిగా ధైర్యము చెప్పి, సహాయం చేసి సాధ్యమైనంతవరకూ వారిని సంతోషపెట్టడానికి, సంతృప్తి పరచడానికి ప్రయత్నం చేయాలి. అంగహీనులైన వారి పిల్లలకు మీరు తగిన రీతిగా సేవలందిస్తూ ఉండాలి. ముఖ్యంగా మా అనంతపురం టీచర్లు ఇలాంటి మంచిపనులు చేస్తూనే ఉన్నారు. అయితే, వారికి మీరిచ్చిన పరికరములు సరిగా పని చేస్తున్నాయా లేదా, వారికి ఉపయోగపడుతున్నాయా లేదా, అని అప్పుడప్పుడు మీరు విచారించి తెలుసుకోవాలి. అది మీ బాధ్యత. అంగహీనులైన పిల్లలకు మాత్రమే కాదు, వారి తల్లిదండ్రులకు కూడా మీరు తగిన సహాయం చేయాలి. వారికి ఇళ్ళు లేవు. అందువలన, వారు బజార్లో భిక్షమెత్తుకుంటూ మనం ఇచ్చిన వస్తువులను కూడా అమ్ముకొని కొద్దికాలంలోనే తిరిగి ఏమీ లేని స్థితికి చేరుకుంటున్నారు. కనుక, వారి తల్లిదండ్రులు ఎవరైనా ఉంటే అంతో ఇంతో వారికి సహాయం చేసి ఇళ్ళు కట్టించడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను. మనం వస్తువులు ఇచ్చినప్పటికీ వాటిని సద్వినియోగము చేసుకొనే శక్తి ఆ పిల్లలకు లేకపోవచ్చు. ఈవిషయంలో మన టీచర్లు కొంతవరకు బాధ్యత తీసుకోవాలి. ఆ పిల్లల నడవడిక ఎలా ఉన్నదో మీరు చక్కగా గమనిస్తూ ఉండాలి. భవిష్యత్తులో వారు అభివృద్ధికి వచ్చేవిధంగా మీరు కృషి చేయాలి. అప్పుడే మీరు చేసిన సేవ సార్థకమౌతుంది. అంతేగాని, ఏదో కొంతమంది వికలాంగులను పుట్టపర్తికి రప్పించి వారికి కొన్ని పరికరములు ఇచ్చి అంతటితో సంతృప్తి పడితే చాలదు. జీవితమంతా వారి బాగోగులను చూసే బాధ్యతను మీరు స్వీకరించాలి. అదే నేను కోరేది. ప్రపంచంలో అనేకమంది అంగహీనులకు ఉపకారము చేస్తున్నారు. దానధర్మాలు చేస్తున్నారు. కాని, వాటి ఉపయోగము తాత్కాలికం. అంగహీనులైన పిల్లలకు శాశ్వతంగా ఉపయోగపడే పనులను మీరు చేపట్టాలి. వారిలో చదువుకోవాలనే ఉత్సాహము కలిగిన పిల్లలుంటారు. వారిని మీరు చేరదీసి, ప్రోత్సహించి వారికి చదువు చెప్పించాలి. ఇందుకు నేను మీకు కావలసిన సహాయం చేస్తాను. నా పని అదే! తప్పక నన్ను అడగండి. ఏది కావాలన్నా ఇస్తాను.

srisathyasaivachanamrutam

**అంగవైకల్యమును చూసుకొని క్రుంగిపోవద్దు**

వికలాంగులైన పిల్లలు కొందరు చెప్పినారు, 'మేము కేవలం 8వ తరగతి, 9వ తరగతి వరకే చదివినాము'ని. మీకు పైచదువులు చదవాలనే ఉత్సాహముంటే చెప్పండి, నేను తప్పక మిమ్మల్ని చదివిస్తాను. చదువు చెడిపోని పదార్థము. నిజానికి, చదువే మీకు ఆస్తి. ధనమును ఎవరైనా దోచుకోవచ్చు. కాని, చదువును ఎవరూ దోచుకోలేరు. కనుక, మీరు వీలైనంతవరకు చదువుకొని, మీ గ్రామంలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ మీ తల్లిదండ్రులకు సహాయం చేయాలి బంగారూ! మీకు అంగవైకల్యము ఏర్పడినందుకు భగవంతుని దూషించకండి. ఏదైనా కష్టము వస్తే మిమ్మల్ని మీరు దూషించుకోవచ్చునుగాని, భగవంతుని మాత్రం దూషించ కూడదు. కాళ్ళు, చేతులు లేకపోవడంవలన మీకు కొంత కష్టం కలిగే మాట నిజమే! మీ కష్టం నాకు తెలుసు. కాని, మీరు క్రుంగిపోతే మిమ్మల్ని చూసి మీ తల్లిదండ్రులుకూడా క్రుంగిపోతుంటారు. అందువలన, మీరు స్వయంశక్తితో అభివృద్ధికి వచ్చి, మీ తల్లిదండ్రులకు తగిన ధైర్యమును, ఉత్సాహమును అందించాలి.

**భగవంతుని సహాయం కోరండి**

భారతదేశము గొప్ప పుణ్యక్షేత్రము; ఎంతో పవిత్రమైన క్షేత్రము; ఎంతో అదృష్టవంతమైన క్షేత్రము. ఇటువంటి పవిత్రమైన దేశంలో జన్మించడం మీ అదృష్టం. నిరంతరం భగవంతుని చింతన చేయండి బంగారూ! భగవంతుడే మిమ్మల్ని అన్నివిధాలుగా కాపాడేది. భగవంతుణ్ణి ప్రార్థించి సహాయం చేయమని కోరితే, తప్పక సహాయం చేస్తాడు. అసలు భగవంతుడు ఉండేది దానికోసమే! మీ ప్రార్థనలో దోషముండవచ్చు గాని, భగవంతునిలో ఎట్టి దోషమూ లేదు. పిలిస్తే పలుకుతాడు భగవంతుడు. ఎప్పుడు కావలసినా సహాయం చేస్తాడు. మన ఇంటనే, వెంటనే, జంటనే ఉండి మనలను కాపాడుతుంటాడు.

sri satyasai vachanamrutam

అడవులందున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేట పడియున్న
దిక్కులేనివారికి దేవుడే దిక్కు

కనుక, ఎట్టి పరిస్థితిలోనూ దేవుని మరువకండి. మీ సమస్త కార్యములను భగవంతునికి అర్పితం చేయండి. తెల్లవారి లేచిన తక్షణమే, "స్వామీ! ఈ దేహమును సార్థకం గావించే పనులు మాతో చేయించండి," అని ప్రార్థించండి. రాత్రి నిద్రించేముందు, "స్వామీ! మాకు చేతనైనంత సేవ చేశాము. మేము చేసిన సేవను సార్థకం గావించండి," అని ప్రార్థించండి. తప్పక భగవంతుడు అనుగ్రహించి, ఆనందించి మీకు అన్నివిధములైన శక్తిసామర్థ్యములను ప్రసాదిస్తాడు.

**దేవుని సమీపానికి గొనిపోవునది సేవయే**

భగవంతునికి ప్రేమయే ప్రధానం. కాని, ఈనాడు లోకములో భగవంతుని పట్ల ప్రేమ తగ్గిపోయింది. అందువల్లనే ప్రజలు అనేక కష్టాలకు గురి అవుతున్నారు. భగవంతునిపై ప్రేమ ఉండాలి. బీదలను చూస్తే జాలి ఉండాలి. ప్రేమ, జాలి ఈ రెండూ మీలో ఉంటే ఇంక మీకంటే అదృష్టవంతులు మరొకరు లేరు. మీవద్ద కోట్లకొద్దీ ధనము ఉండవచ్చును. మీరు గొప్పగొప్ప భవనములు కట్టించవచ్చును. కాని, దైవానుగ్రహమే లేకపోతే అన్నీ వ్యర్థమైపోతాయి. కనుక, దైవానుగ్రహమును పొందే నిమిత్తం మీ శక్తికొలదీ సేవలు చేస్తూరండి బంగారూ! జయమ్మ, అనంతపురం కళాశాల టీచర్లు, విద్యార్థినులు మధ్యమధ్య ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి, అంగహీనులకు తగిన సేవలు అందించాలని నేను ఆశిస్తున్నాను. నిజంగా మీరు నేర్చిన విద్య ఈ సేవలకోసమే! సేవకంటే మించినది మరొకటి లేదు. సేవను మించిన ధనము లేదు. దీనిని దృష్టిలో పెట్టుకోండి. ఈ అంగహీనులను మీరు అప్పుడప్పుడు కలుసుకొని వారి యోగక్షేమాలను విచారిస్తే వారికెంతో ఉత్సాహంగా ఉంటుంది. వారిని మనదగ్గరికి రమ్మని చెప్పకూడదు. మనమే వారిదగ్గరకు పోవాలి. వారిని ఆనందపరచే మాటలు మాట్లాడి వారికి తగినరీతిగా సేవలు చేయాలి. సేవయే మానవునికి

sri sathyasai vacharamrutam

ధైర్యమునిచ్చేది. సేవయే దేవుని సమీపానికి గొనిపోవునది. అందరినీ ప్రేమించండి. అందరికీ సహాయం చేయండి. అదియే మానవుడు చేయవలసిన పని.

**దిక్కులేనివారికి చేసే సేవయే నిజమైన సేవ**

విద్యార్థినీ విద్యార్థులారా! పెద్దపెద్ద చదువులు చదివినవారిలో, చదువును దుర్వినియోగపర్చుకొనే దుర్మార్గులను ఎంతమందినో చూస్తున్నాను నేను. మీరు మాత్రం ఆవిధంగా పోవద్దు. మీరు చదివిన చదువును మీకంటే బలహీనులకు, చిన్నవారికి బోధించి, ఆ చదువును సద్వినియోగం చేసుకోండి. మన భారత దేశములో ఎంతోమంది గొప్పవారున్నారు. కాని, ఏమి ప్రయోజనము? కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం లేదు. నిజానికి గొప్పవారికంటే గొప్ప గుణమున్నవారే మేలు. గొప్పవారు ఏమాత్రము ఉపకారము చేయడం లేదు. మీరు వారివలె కాకుండా భగవంతుడు మీకు ప్రసాదించిన అంగములను సద్వినియోగం చేసుకోండి. పదిమందికి ఉపకారము చేయండి. అప్పుడే మీ జన్మలు, మీరు నేర్చిన విద్యలు సార్థకమవుతాయి. సేవ చేయకుండా జప, తప, ధ్యానాదులు చేస్తే ప్రయోజనం లేదు. దిక్కులేనివారికి చేతనైనంత సహాయం చేయాలి. వారికి ఉత్సాహప్రోత్సాహములివ్వాలి. అంతకంటే మించిన సాధన లేదు బంగారూ! మీకు అన్ని అంగములూ చక్కగా ఉన్నాయి. కనుక, అంగహీనులలో నిరాశా నిస్పృహలకు తావులేకుండా మీరు వారికి తగిన సహాయము చేయాలని నేను ఆశిస్తున్నాను. అన్ని సౌకర్యములూ ఉన్నవారికి సేవచేస్తే ప్రయోజనం లేదు. దిక్కులేనివారికి మీరు సేవ చేయాలి. అదే నిజమైన సేవ. కొన్ని సెలవు దినాలు, ఆదివారాలు వస్తుంటాయి. ఆ సెలవుల్లో ఇంటిలో కూర్చొని పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుకుంటూ కాలం వ్యర్థం చేసే బదులు పల్లెలకు పోయి సేవలు చేయండి. దీనులను, దిక్కులేనివారిని చేరదీసి, వారికి ఆనందమునందించండి.

**శ్రీ సత్యసాయి దీనజనోద్ధరణ పథకము**

మీకు తెలుసు బంగారూ! ఇక్కడ దీనజనోద్ధరణ పథకమును చేపట్టి, తల్లి, తండ్రి లేని పిల్లలను 65మందిని చేర్చుకున్నాము. వారికి విద్య నేర్పిస్తూ, ఒక్కొక్కరి పేరుతో ఒక్కొక్క

sri sathyasaivachanamrutam

లక్షరూపాయలు డిపాజిట్ చేశాము. పెద్దవారైన తరువాత పెళ్ళీ, పేరంటమూ చేసుకొని స్వతంత్ర్యముగా జీవించడానికి వెళ్ళేటప్పుడు ఆ లక్ష రూపాయలను వారే తీసుకోవచ్చు. ఈవిధంగా మనము చేసే సహాయము ఏదైనా శాశ్వతమైనదిగా చేయాలి. అప్పటికప్పుడు జరిగిపోయేది కాదు మనం చేయవలసింది. ఉండడానికి ఇల్లు ఉండాలి. తినడానికి తిండి ఉండాలి. కట్టడానికి బట్ట ఉండాలి. ఈవిధంగా దిక్కులేనివారిని మీరు ప్రేమతో చేరదీసి, వారికి ధైర్యం చెప్పి వారికి ఉత్సాహ ప్రోత్సాహములందించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 12.11.2003, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam